సాక్షి
విశాఖపట్నం
గురువారం । 7 । ఆగస్టు । 2025



జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలో విజయం సాధించిన అనంతరం కేకే రాజును ఎత్తుకుని హర్షం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి సాడి పద్మారెడ్డి విజయం అనంతరం అభినందనలు తెలుపుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

కూటమిపై వ్యతిరేకతకు స్థాయీ ఫలితాలే నిదర్శనం

వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



దాబాగార్డెన్స్‌: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక ఫలితాలే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనమని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. జీవీఎంసీ వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారంటే.. ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతోందన్నారు. ఈ ఎన్నికల్లో కూడా కూటమి పార్టీలు డబ్బు, క్యాంపు రాజకీయం చేశాయన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన కార్పొరేటర్లకు తమ బలమైన 32 కంటే అధికంగా ఓట్లు వచ్చాయన్నారు. 50 ఓట్లతో ఒక సీటు గెలిచామన్నారు. కూటమి కార్పొరేటర్లు కూడా తమకు ఓటు వేయడం విశేషమన్నారు. కూటమి నేతలు భయభ్రాంతులకు గురి చేసినా ఎంతో ధైర్యంతో పోటీలో నిలిచిన వారికి అభినందనలు తెలిపారు. అయితే గెలిచిన స్థానాన్ని ప్రకటించడానికి కూడా ఇబ్బంది పెట్టారని వాపోయారు. తమ వెన్నంటే ఉండి సహాయ సహకారాలు అందించిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్‌ కో ఆర్డినేటర్‌ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా పార్లమెంట్‌ పరిశీలకుడు కదిరి బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, మజ్జి శ్రీనివాసరావు, తిప్పల దేవన్‌రెడ్డి, మలసాల భరత్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌ లీడర్‌ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మేయర్‌ తీరుకు అద్దంపట్టే ఫలితాలు



ఈ ఎన్నిక మేయర్‌పై తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనం .బీసీ మహిళను గుర్తించి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మేయర్‌ పదవి ఇస్తే.. కూటమి ప్రభుత్వం కార్పొరేటర్లను కొనుగోలు చేసి అడ్డగోలుగా దించేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థాయీ సంఘం ఎన్నికల్లో కూటమి క్యాంపు రాజకీయాలు చేసింది. ఇప్పుడు ఆ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు మేయర్‌ తీరును నిరసిస్తున్నారు.

– గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్‌

ఓటుకు నోటు రాజకీయం చేసినా..



కూటమి పార్టీలు ఓటుకు నోటు రాజకీయం చేసినా వైఎస్సార్‌ సీపీ ఓ స్థానం గెలవడం వారికి చెంపపెట్టు. వైఎస్సార్‌ సీపీ తరఫున పోటీ చేసిన అందరికీ కూటమి కార్పొరేటర్లు సహకరించడం విశేషం. మేయర్‌గా పీలా శ్రీనివాస్‌ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్పొరేటర్లలో కూడా సమన్వయం లోపించిందనడానికి ఈ ఎన్నికే నిదర్శనం.

బాణాల శ్రీనివాసరావు, ఫ్లోర్‌ లీడర్, వైఎస్సార్‌ సీపీ

సహకరించిన వారికి ధన్యవాదాలు



వైఎస్సార్‌ సీపీకి చెందిన 32 మంది కార్పొరేటర్లతో పాటు నా విజయానికి సహకరించిన కూటమి కార్పొరేటర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మూడు నెలల కిందటే మేయర్‌ను అప్రజాస్వామికంగా మార్చేశారు. అప్పటి నుంచే కూటమికి వ్యతిరేక రోజులు ప్రారంభమయ్యాయి.

– సాడి పద్మారెడ్డి, 24వ వార్డు కార్పొరేటర్, స్థాయీ సంఘం ఎన్నిక విజేత

కూటమిలో లుకలుకలు



కూటమిలో లుకలుకలకు ఈ ఎన్నికే ఉదాహరణ. అప్రజాస్వామికంగా మూడు నెలల కిందట నిర్వహించిన మేయర్‌ అవిశ్వాస తీర్మానంపై పలువురు కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నారు. వైఎస్సార్‌ సీపీ నుంచి వెళ్లిన పలువురు కార్పొరేటర్లు పశ్చాత్తాప పడుతున్నారన్నారు. ఈ ఎన్నికలో వారితో పాటు సహకరించిన కూటమి కార్పొరేటర్లకు కృతజ్ఞతలు.

– కటుమూరి సతీష్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ

కూటమికి స్టాండింగ్‌ షాక్‌!

వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి సాడి పద్మారెడ్డి విజయం

మేయర్‌పై వ్యతిరేకత..
కూటమి పార్టీలో లుకలుకలు
హైకోర్టు కేసు నేపథ్యంలో వేటు భయం
భారీగా జరిగిన క్రాస్‌ ఓటింగ్‌

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/దాబాగార్డెన్స్‌ :

కూటమి పార్టీల్లో రోజురోజుకీ పెరుగుతున్న లుకలుకలు.. మేయర్‌ వ్యవహారశైలి పట్ల సొంత పార్టీ కార్పొరేటర్లల్లో వ్యతిరేకత.. పార్టీ మారిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలు... వెరసి జీవీఎంసీ స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి సాడి పద్మారెడ్డి ఏకంగా 50 ఓట్లతో విజయం సాధించారు. మొత్తం 10 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీలో చేరిన కార్పొరేటర్లతో పాటు కూటమిలోని మరికొందరు కార్పొరేటర్లు కూడా క్రాస్‌ ఓటింగ్‌కు దిగడంతో కూటమికి షాక్‌ తగిలింది. గత స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో మొత్తం 10 స్థానాల్లో విజయం సాధించిన కూటమికి ఈ దఫా జరిగిన ఎన్నికల్లో ఓ స్థానంలో ఓటమి తప్పలేదు. వాస్తవానికి సాధారణ ఎన్నికల తర్వాత కూటమి పార్టీల్లోకి పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు జంప్‌ అయ్యారు. ఇక వైఎస్సార్‌ సీపీకి నికరంగా 32 మంది కార్పొరేటర్లు మిగిలారు. స్థాయీ సంఘం ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న 10 మంది అభ్యర్థులకు 32 కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. దీన్ని బట్టి కూటమి పాలన పట్ల కార్పొరేటర్లలో ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమవుతోంది.

కనీస గౌరవమేదీ..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవీఎంసీపై కన్నేశారు. గత ఏడాది జరిగిన స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల్లో రిసార్టు రాజకీయాలు నడిపి.. ప్రతి ఒక్కరికీ ఒక్కో రకం పెన్సిల్‌ ఇచ్చి మరీ ఓటింగ్‌ జరిపారు. వైఎస్సార్‌ సీపీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్లకు పలు ఆశలు చూపి తమ పార్టీలో చేర్చుకున్నారు. అయితే పార్టీ మారే వరకూ ఎంతో గౌరవంగా పలకరించి.. స్టాండింగ్‌ కమిటీతో పాటు మేయర్‌ ఎన్నికల అనంతరం కనీసం పట్టించుకోవడం మానేశారంటూ పలువురు కార్పొరేటర్లు వాపోతున్నారు. తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. ఇక పార్టీ మారిన కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనిపై సమాధానం చెప్పాలంటూ కలెక్టర్‌ నోటీసులు జారీ చేశారు. ఎక్కడ తమపై వేటు పడుతుందోనన్న ఆందోళనతో పార్టీ మారిన కార్పొరేటర్లు కొందరు వైఎస్సార్‌ సీపీకి ఓటు వేసినట్లు తెలుస్తోంది.

కూటమి పార్టీల్లో పెరిగిన అంతరం!

స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీల మధ్య లుకలుకలు బయటపడ్డాయి. ఈ ఎన్నికల్లో జనసేనకు కనీసం 2 స్థానాలైనా ఇవ్వాలని కోరగా ఒక్క స్థానం కూడా ఇవ్వలేదు. పోటీలో నిలిచిన కార్పొరేటర్‌ సాధిక్‌ను చివరిలో తప్పించారు. ఈ నేపథ్యంలో జనసేన కార్పొరేటర్‌ మూర్తి యాదవ్‌ ఏకంగా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. సీపీఎం కార్పొరేటర్‌ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉంది. మరోవైపు టీడీపీ కూటమిలోని జనసేన, బీజేపీలను కలుపుకుని వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. కూటమిలోని లుకలుకలు కూడా ఈ ఫలితాలకు కారణమైనట్లు తెలుస్తోంది. అలాగే గత స్టాండింగ్‌ కమిటీ పేరుతో జరిపిన వసూళ్లలో జీవీఎంసీలో కీలక నేత పాత్రపైనా ఆరోపణలున్నాయి. స్టాండింగ్‌ కమిటీ పేరుతో నామినేషన్‌ పనుల్లో 10 శాతం వాటా అడిగి మరీ వసూలు చేయడంపై కాంట్రాక్టర్లల్లో వ్యతిరేకత ఉంది. వసూలు చేసిన మొత్తం కూడా కీలక నేతకు చేరిన తర్వాత పంపకాలు జరపడం... అదీ నామమాత్రంగా ఉండటం పట్ల కూడా గుర్రుగా ఉన్నారు. మొత్తంగా జీవీఎంసీ స్టాండింగ్‌ కమిటీ ఎన్నికల ఫలితం కూటమి పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు నిదర్శనంగా నిలుస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.






ఓటేస్తున్న పీలా శ్రీనివాస్, గొలగాని హరివెంకట కుమారి, బాణాల శ్రీనివాస్, కటుమూరి సతీష్‌

మేయర్‌పై గుర్రు

ప్రధానంగా మేయర్‌ పీఠం ఎక్కిన తర్వాత పీలా శ్రీనివాస్‌ వ్యవహరిస్తున్న తీరు పట్ల సొంత పార్టీ కార్పొరేటర్లలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కనీస గౌరవం లేకుండా వ్యవహరిస్తున్న తీరుతో పాటు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు కూడా ఏవీ జరగకపోవడం.. కేవలం ఆయన చుట్టూనే వ్యవహారాలన్నీ నడిపేందుకు ప్రయత్నించడంతో కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నారు. కౌన్సిల్, స్టాండింగ్‌ కమిటీ సమావేశాల్లో చర్చ లేకుండా ఇష్టానుసారంగా ముందుకెళ్లారనే ఆగ్రహంతోనూ ఉన్నారు. మరోవైపు మేయర్‌కు, కూటమి పార్టీలోని ఎమ్మెల్యేల మధ్య సఖ్యత కూడా సరిగా ఉండడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. వారికి కనీస సమాచారం ఇవ్వకుండా వెళుతున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో నేరుగా కయ్యానికి దిగడంతో వారి మధ్య మరింత దూరం పెరిగింది. మేయర్‌ ఎన్నిక వరకూ తమతో ఎంతో సఖ్యతగా ఉంటూ.. అన్న అన్న అని నక్కవినయం చూపించి తీరా గెలిచిన తర్వాత వ్యవహరిస్తున్న తీరు పట్ల ప్రధానంగా అందరిలోనూ వ్యతిరేకత నెలకొని ఉన్నట్లు తెలుస్తోంది.



ఎన్నికైన స్థాయీ సంఘం సభ్యులు

ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయంటే..

దాబాగార్డెన్స్‌: స్థాయీ సంఘం ఎన్నికలో కొణతాల నీలిమకు అత్యధికంగా 58 ఓట్లు రాగా, గంకల కవితకు 57, దాడి వెంకట రామేశ్వరరావుకు 57, మొల్లి హేమలతకు 57, సేనాపతి వసంతకు 54, గేదెల లావణ్యకు 53, మాదంశెట్టి చిన్నతల్లికి 52, రాపర్తి త్రివేణి వరప్రసాదరావుకు 52, మొల్లి ముత్యాలు 51, సాడి పద్మావతి(పద్మారెడ్డి)కి 50 ఓట్లు పోలయ్యాయి.

వైఎస్సార్‌ సీపీకి లెక్కకు మించి..

వైఎస్సార్‌ సీపీ కార్పొరేటర్లకు లెక్కకు మించి ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌ సీపీకి 32 మంది కార్పొరేటర్ల బలమే ఉన్నప్పటికీ.. కూటమి పార్టీలకు చెందిన పలువురు కార్పొరేటర్లు ఓట్లు వేశారు. సాడి పద్మారెడ్డికి 50, నెక్కల లక్ష్మికి 39, పల్లా అప్పలకొండకు 38, మహ్మద్‌ ఇమ్రాన్‌కు 38, కోడిగుడ్ల పూర్ణిమకు 38, రెయ్యి వెంకటరమణకు 37, గుండాపు నాగేశ్వరరావుకు 35, ఉరుకూటి రామచంద్రరావుకు 35, కేవీఎన్‌ శశికళకు 34, బిపిన్‌ కుమార్‌ జైన్‌కు 33 ఓట్లు పోలయ్యాయి.

పల్లాకే జెల్ల..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రతిపాదించిన గాజువాకకు చెందిన కూటమి కార్పొరేటర్‌ రౌతు శ్రీనివాస్‌కు కూటమి కార్పొరేటర్లు జెల్ల కొట్టారు. కూటమి పార్టీ నుంచి అత్యధికంగా బలం ఉన్నప్పటికీ ఆ కార్పొరేటర్లు ఎవరూ రౌతుపై మొగ్గు చూపలేదు. పల్లా శ్రీనివాసరావు ప్రతిపాదించిన వ్యక్తికే కూటమి కార్పొరేటర్లు ఓటు వేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో లుకలుకలకు స్థాయీ సంఘం ఎన్నిక శ్రీకారం చుట్టినట్టయిందని పలువురు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

అభినందన



జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించిన సాడి పద్మారెడ్డి.. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు నేతృత్వంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బొత్సను కలిసిన వారిలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, కరణం ధర్మశ్రీ, మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌ కటుమూరి సతీష్, ఫ్లోర్‌ లీడర్‌ బాణాల శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

దాబాగార్డెన్స్‌ : జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికలో 10 మంది సభ్యులు ఎన్నికైనట్లు కమిషనర్‌ కేతన్‌ గార్గ్‌ తెలిపారు. 20 మంది పోటీలో ఉండగా 92 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 2 గంటల వరకు జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్‌ఎస్‌ వర్మ పర్యవేక్షణలో ఎన్నిక జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందినవారికి ధ్రువీకరణ పత్రాలను జీవీఎంసీ కార్యదర్శి రమణ అందజేశారు.

సింహగిరి నుంచి దాసుడు తిరుగు పయనం



తన పరివారంతో తిరుగు పయనమవుతున్న లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్‌

సింహాచలం: ఒడిశాకి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్‌ బుధవారం సింహగిరిపై నుంచి తిరుగుపయనమయ్యారు. ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విశేష సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత తరానికి చెందిన లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్‌ ఈ ఏడాది మే నెలలో సింహగిరికి వచ్చారు. సింహగిరిపై ఉన్న దాసుల ఆశ్రమంలో సుమారు మూడు నెలలపాటు ఉండి స్వామికి విశేష సేవలందించారు. నిత్యకల్యాణం, గరుడసేవ, ఊంజల్‌సేవ, కోలా సేవ, లక్ష తులసి పూజ తదితర సేవలను జరిపించారు. తిరిగి బుధవారం మధ్యాహ్నం సింహగిరి నుంచి తిరుగు పయనమయ్యారు. ఈవో కార్యాలయం వద్ద దేవస్థానం అధికారులు ఆయన్ని సత్కరించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఏయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్‌ ఆఫ్‌ అడ్మిషన్స్‌ ఆచార్య డీఏ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ, ఎంపిక తేదీలను త్వరలో ఖరారు చేస్తామన్నారు. వివరాలకు ఏయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సైన్స్ ఫెయిర్‌లో చక్కటి ప్రాజెక్టులు ఆవిష్కరించాలి

ఆరిలోవ: జిల్లాల్లో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్ కోసం ఇన్‌స్పైర్ మనక్–2025 పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ డీఈవో ఎస్.ప్రేమకుమార్, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ పి.రాజారావు, రిసోర్స్ పెర్సన్లు చంద్రాజీ, జానకిరాంతో కలసి ఆవిష్కరించారు. ఆరు నుంచి 12వ తర గతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని మంచి ప్రాజెక్టులు తయారు చేసే విధంగా సిద్ధం చేయాలని విద్యా శాఖాధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఫెయిర్‌కు జిల్లా నుంచి అత్యధికంగా నామినేషన్లు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది దేముడుబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



ఇన్‌స్పైర్ మనక్–2025 పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఈవో ప్రేమకుమార్

ప్రపంచ రికార్డు సృష్టికర్త సుధాకర్ కన్నుమూత



పట్నాల జె.సుధాకర్

విశాఖ సిటీ : సీనియర్ జర్నలిస్ట్, 110 డిగ్రీలతో ప్రపంచ రికార్డు సృష్టించిన పట్నాల జె.సుధాకర్ బుధవారం విశాఖలో కన్నుమూశారు. 1957, డిసెంబర్ 1న జన్మించిన ఆయన డిగ్రీలు సాధించడంలో రికార్డు నెలకొల్పారు. మహారాష్ట్రకు చెందిన శ్రీకాంత్ జిచ్కర్ తర్వాత ఈ రికార్డును కలిగి ఉన్న ఏకైక వ్యక్తిగా సుధాకర్ గుర్తింపు పొందారు. ఆయన అనారోగ్యం కారణంగా బుధవారం మరణించారు. గురువారం నగరంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

మహా విశాఖ నగర పాలక సంస్థ

రహదారి అభివృద్ధి ప్రణాళికపై పౌరుల అభ్యంతరాలు / సూచనలు

ఆర్.సి. నెం.:1906/2015/ACP-VI/G1 Dt. 24-07-2025

మహా విశాఖ నగర పాలక సంస్థ, విశాఖపట్నం, కూర్మన్నపాలెం NH-16 జంక్షన్ నుండి దువ్వాడ ఫ్లై- ఓవర్ రోడ్డు ప్రస్తుతం 30'-0" & 60'-0" అడుగుల రహదారిని 100'-0" అడుగుల రహదారిగా సర్వే నెంబర్లు 16/పి to 19/పి, 47/పి to 50/పి, 53/పి, 55/పి to 59/పి, 61/పి, 63/పి to 69/పి, 76/పి, 115/పి to 122/పి కూర్మన్నపాలెం గ్రామము మరియు సర్వే నెంబర్లు 19/పి to 21/పి, 24/పి to 28/పి వడ్లపూడి గ్రామం (కూర్మన్నపాలెం వార్డు), గాజువాక జోన్ రహదారి అభివృద్ధి ప్రణాళిక RDP No.11/2015,Dt.28.09.2015, పొడువు 2.10 కి.మీ.లతో మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ అనుసరించి అభివృద్ధి పరచుటకు రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్ రూపొందించుట జరిగినది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు టి.డి.ఆర్ ఆమోదం కొరకు G.O.Ms.No.4 MA&UD, Dated:09.01.2025, Rule 169,3(c) నందు ప్రభుత్వం వారు నూతన నిభంధనలు జారీచేసియున్నారు. సదరు నిబంధనలు ప్రకారము రోడ్డు వెడల్పు చేయుటలో కోల్పోయిన నిర్వాసితులకు టి.డి.ఆర్ ఇచ్చుటకు జతపరిచిన లిస్టు (16 nos.) జి.వి.యం.సి. ప్రధాన కార్యాలయము నందు మరియు జోన్-6, గాజువాక జోనల్ కార్యాలయము నందు మరియు జి.వి.యం.సి. వెబ్ సైట్ నందు పొందుపరచడం జరిగినది. కావున ఈ లిస్టులో చూపబడిన అభ్యర్థులపై ఏమైనా అభ్యంతరములు / సూచనలు మొదలగునవి ఉన్న యెడల జి.వి.యం.సి. ద్వారా ఈ నోటిఫికేషన్ వెలువడిన తేది నుండి 7 రోజులలోపు జి.వి.యం.సి. వారికి తెలియజేయవలెను. అభ్యంతరములు / సూచనలు మొదలగునవి లేని యెడల ఇందుతో జతపరిచిన లిస్టులో చూపిన అభ్యర్థులకు నిభంధనల ప్రకారము టి.డి.ఆర్ లు ఆమోదము తెలుపబడునని తెలియజేయడమైనది.

S.no	PROPERTY NAME	Name of the Previous owner	Name of the Present owner	SY.NO	Extent in Sq.mts	Extent in Sq.yds	Extent in Sq.yds @ 1:4	REMARKS
1	L-14	Kusampudi Venkata Appala Raju	Kusampudi Venkata Appala Raju	120-3 Part of Kurmannapalem (V)	52.67	62.99	251.96	Not received Objection But, Sy.No & Extent Change
2	L-17B	Jampana Sujatha W/o Ramaling Raju	Jampana Sujatha W/o Ramaling Raju	119-6 Part of Kurmannapalem (V)	32.6	38.99	155.96	Not received Objection But, Sy.No & Extent Change
3	L-17C	Rudra Raju Ramakrishnam Raju S/o Rudra Raju Narasimha Raju	Rudra Raju Ramakrishnam Raju S/o Rudra Raju Narasimha Raju	119-6-Part of Kurmannapalem (V)	31.77	37.99	151.96	Not received Objection But, Sy.No & Extent Change
4	L-30	G.Jaya Sri	Gogineni Hima Bindu D/o Gogineni Vijay Kumar	118-2B2 part of Kurmannapalem (V)	48.7	58.2	232.8	Received Objection , Name Change
5	L-47	Md. Shaik Noor Jahan W/o M.S. Mohiddin	Md. Shaik Noor Jahan W/o M.S. Mohiddin Md. Rafiya Unnisa Begam W/o Fahim Shiraji	116-1APart of Kurmannapalem (V)	44.58	53.27	213.08	Received Objection , Name Change
6	L-68	Chennupati Vijayabhaskar Rao	Chennupati Rama Devi W/o Late Vijaya Bhaskar	65-4Part of Kurmannapalem (V)	158.68	189.62	758.48	Received Objection, Name Change
7	L-71	Ganadiredi Saradga	Sirish Gandreti S/o Late ramarao	65-5BPart of Kurmannapalem (V)	265.5	317.27	1269.08	Received Objection , Name Change
8	R-17	V V N M Raju S/O V B Ram Murthi Raju	1.Vemanamanda Venkata Seetharama Raju S/o Balarama Murthy Raju 2.Edaraplli Surya Ratnam W/o Surya Narayana Raju 3.Kammela Padmavath W/o Venkata Subbaraju	25-1A Part of Vadlapudi (V)	125.37	149.94	599.76	Not received Objection But, Name Change
9	R-32	1) K.Ramanamma 2) Nagisetti Kanaka maha Lakshmi	1.Kadha Ramanamma W/o SriRamulu 2.Nagisetti Kanaka Mahalaxmi W/o Thammi Naidu 3.Neelakayala Ramya W/o Neela kayala Narasingarao 4.Gavva Varalakshmi W/o Srinivasa Rao	19-1A part of Vadalapudi (V)	69.08	82.62	330.48	Not received Objection But, Name Change
10	R-34	K Govind	1.Karri Mahalaxmi Naidu S/o Mulayya 2. Karri Govind S/o Mulayya	116-3F Part of Kurmannapalem (V)	77.75	92.99	371.96	Not received Objection But, Name Change
11	R-38	1.Lella Koteswara rao 2.Lella Padmavathi	1.Lella Padmaja W/o Lella Koteswara rao	116-3D Part of Kurmannapalem (V)	27.59	32.99	131.96	Not received Objection But, Name, Sy no & Extent Change
12	R-52	Karri Swati	Karri Swati W/o Late Karri Sunil	63-10 part of Kurmannapalem (V)	80.26	95.99	383.96	Not received Objection But, Sy.No & Extent Change
13	R-57	P.Vijaya Laxmi	1.Penumatcha Vijaya Lakashmi W/o Late Appala raju 2.Penumatcha Balarama Raju S/o Late Appala raju 3.Penumatcha Geetha D/o Late Appala raju	65-1B Part of Kurmannapalem (V)	79.10	94.60	378.4	Not received Objection But, Name &Sy.No Change
14	R-60	B Dhanalakshmi	1.Budumurru Gopinadh S/o Srinivasa rao 2.Budumurru Dhana Laxmi W/o Gopinadh	66-1A part of Kurmannapalem (V)	84.44	100.99	403.96	Not received Objection But, Name Change
15	R-62 A	B.Ramalakshimi	1.Bandaru Arun Kishore S/o Ramaliga Swamy 2.Bandaru Madhusudhana Rao S/o Ramaliga Swamy 3. Bandaru Chandra Sekhar S/o Ramaliga Swamy	66-1A part of Kurmannapalem (V)	54.34	65.00	260	Not received Objection But, Name & Extent Change
16	R-64	N Nageswara Rao	1.Nethi Nageswararo S/o Late Sethu Madhava Veera Rahgava Sharama 2.Nethi Veera Venkata Naga Satya Vani W/o Nageswararo 3.Nethi Raveendra S/o Nageswararo 4. Nethi Phaneendra S/o Nageswararao	68-1 Part of Kurmannapalem (V)	88.62	105.99	423.96	Not received Objection But, Name, Survey Number and Extent Change

Sd/- Commissioner, GVMC

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

- వంతెన రక్షణ గోడను ఢీకొన్న కంటైనర్
- 30 అడుగుల ఎత్తు నుంచి పడి డ్రైవర్ దుర్మరణం



మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెందుర్తి : ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి–16(బైపాస్) పెందుర్తి సమీపంలోని సరిపల్లి వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి.. జాతీయ రహదారిపై సబ్బవరం వైపు నుంచి ఆనందపురం వైపు వెళుతున్న కంటైనర్ సరిపల్లి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పింది. ఈ క్రమంలో వంతెన రక్షణ గోడ వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో కంటైనర్ డోర్ తెరుచుకోవడంతో డ్రైవర్ రాకేష్‌కుమార్(40) దాదాపు 30 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి విచారణ చేపట్టారు. రాకేష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునిది ఉత్తర ప్రదేశ్ రోషన్‌నగర్. అతని బంధువులకు సమాచారం అందించారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్



తొలి ఆటోను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, డీఆర్‌ఎం లోహిత్ బోహ్రా

గోపాలపట్నం: ప్రయాణికుల భద్రత కోసం ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్‌ను ప్రారంభిస్తున్నట్లు రైల్వే డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రిపెయిడ్ ఆటో ట్యాక్సీ స్టాండ్‌ను బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. ఇక్కడి రైల్వే స్టేషన్‌లో 22 రైళ్లు ఆగుతున్నాయని, వాటిలో దిగే ప్రయాణికులు నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లేటపుడు భద్రత పరంగా భయపడనక్కర్లేకుండా ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఆటో ధరలు ఉంటాయన్నారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తయితే ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. ఇక్కడ ఈ స్టాండ్ ఏర్పాటుకు సహకరించిన దాతలకు గోపాలపట్నం సీఐ ఎస్వీ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రయాణికులకు టోకెన్ అందించి ఆటోలో ఎక్కించి, జెండా ఊపి ఆటో ట్యాక్సీ సేవల్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మేరీ ప్రశాంతి, ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ ఏటీ పృధ్వీతేజ, ట్రాఫిక్ సీఐలు సురేష్‌కుమార్, దాశరథి, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో కొట్లాట.. ఐదుగురికి గాయాలు



గాయపడిన గంగరాజు

కూర్మన్నపాలెం: స్థల వివాదం కొట్లాటకు దారి తీయడంతో ఐదుగురు గాయపడ్డారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. పెదగంట్యాడ మండలం అప్పికొండలో రౌడీషీటర్ గరికిన గంగరాజు, ఆయన సోదరి చోడిపల్లి బంగారమ్మల మధ్య చాలా రోజుల నుంచి భూవివాదం ఉంది. దీనిపై ఇరువర్గాల వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదం నడుస్తుండగానే గంగరాజు సదరు స్థలాన్ని చదును చేసేందుకు పనులు ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న బంగారమ్మ.. భర్త వెంకటరావుతో కలిసి అక్కడికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈలోగా గంగరాజు భార్య, కుమారుడు అక్కడకు చేరుకున్నారు. ఒకరిపై ఒకరు రాళ్లు, కర్రలతో దాడి చేసుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణలో గంగరాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో కుట్లు పడ్డాయి. గంగరాజు సోదరి బంగారమ్మకు కూడా తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారిద్దరితోపాటు గంగరాజు భార్య, కొడుకు కోటేశ్వరరావు, బావ వెంకటరావు కూడా గాయపడ్డారు. గంగరాజు కుటుంబసభ్యులు అగనంపూడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆయన సోదరి, బావ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదన్నారు. ఇరు వర్గాలపై కేసు నమోదుచేసి, నిందితులు గంగరాజుతోపాటు భార్య బంగారమ్మ, కొడుకు కోటేశ్వరరావు, కూతురు భానులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపారు.